
# సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 31 । మార్చి । 2023




భక్తులకు హారతి చూపుతున్న వేద పండితుడు






జిల్లా కేంద్రంలో తాళి చూపుతున్న అర్చకుడు





బోథ్: సొనాలలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాపూరావ్

జిల్లా కేంద్రంలో నిర్వహించిన శోభాయాత్రలో అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు

## కల్యాణ వైభోగమే..

అంతా రామమయం.. అంతటా శ్రీరామ జపం.. కనుల పండువగా సీతారామ కల్యాణ మహోత్సవం.. వీనుల విందుగా శోభాయాత్ర.. ఎక్కడా చూసినా జై శ్రీరామ్ నినాదాలు.. ఇలా జిల్లాలో శ్రీరామనవమి సంబురం అంబరాన్ని తాకింది. జిల్లా వ్యాప్తంగా పండుగను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులు పూజలు చేయగా, మధ్యాహ్నం అంగరంగ వైభవంగా శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. పలుచోట్ల నిర్వహించిన శోభాయాత్రలు ఆకట్టుకున్నాయి. జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ మండలం సొనాల గ్రామంలోని రామాలయంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, ఉట్నూర్ మండల కేంద్రంలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డు సీతారామాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకలకు కలెక్టర్ రాహుల్‌రాజ్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. – సాక్షి నెట్‌వర్క్



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న



జిల్లా కేంద్రంలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న హిందూ సంఘాల నాయకులు



సీతారామాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు



ఉట్నూర్ మండల కేంద్రంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

## న్యూస్‌రీల్

### పేపర్‌బాయ్‌కి విరాళంగా సైకిల్ అందజేత



యువకుడికి సైకిల్ అందజేస్తున్న వాకర్స్

ఆదిలాబాద్‌టౌన్: నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువకుడికి మార్నింగ్ వాకర్స్ అండగా నిలిచారు. పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన సూరం విశాల్ అనే యువకుడు పేపర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. సదరు యువకుడికి సైకిల్ లేక పేపర్ వేసేందుకు ఇబ్బందులు పడ్డాడు. గుర్తించిన వాకర్స్ రూ.10వేల విలువైన సైకిల్‌ను జిల్లా కేంద్రంలో యువకుడికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో తలమడుగు జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల మల్లన్న, పున్నారావు, వెంకటకృష్ణారెడ్డి, అనిమేశ్‌బాబు, గంగాధర్, గోవర్ధన్‌రెడ్డి, రాజమల్లు, బ్రహ్మం, స్వామిరెడ్డి, ప్రసాద్, లక్ష్మారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, హరీశ్ పాల్గొన్నారు.

### నైపుణ్యాలు గుర్తించి ప్రోత్సహించాలి

ఆదిలాబాద్‌టౌన్: తల్లిదండ్రులు పిల్లల్లోని నైపుణ్యాలు గుర్తించి వారిని ప్రోత్సహించాలని జిల్లా జడ్జి ఎంఆర్ సునీత సూచించారు. బుధవారం సాయంత్రం జరిగిన శ్రీసరస్వతి శిశుమందిర్ స్వర్ణోత్సవాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలపై తమ అభిప్రాయాలు రుద్దడంతో వారు మనోవేదనకు గురవుతారని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుంటూ సాధనకు ముందుకుసాగాలని సూచించారు. పదో తరగతి వరకు మొబైల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని, చదువుపై ప్రత్యేక దృష్టి సారిస్తే భవిష్యత్‌లో మంచి స్థానాలకు ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత, పట్టణ ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు, పూర్వ విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

### షెడ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రాంనగర్ కాలనీలోగల కోదండ రామాలయంలో రూ.5 లక్షలతో, రాంనగర్‌లోని సవారి బంగ్లా వద్ద రూ.10లక్షలతో చేపట్టిన షెడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కాలనీవాసులు ముందుగా ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలోని ఆయా వార్డుల అభివృద్ధికి రూ.74 కోట్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రాధాన్యక్రమంలో కాలనీలకు కేటాయించి పనులు చేపడతామని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, స్థానిక కౌన్సిలర్ సంగీత భూమన్న, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అజయ్, నాయకులు దమ్మపాల్, మెట్టు ప్రహ్లాద్, అశోక్ స్వామి పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ కవితను కలిసిన జాగృతి జిల్లా అధ్యక్షుడు



ఎమ్మెల్సీ కవితతో శ్రీనివాస్‌రావు

కైలాస్‌నగర్: తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవితను జిల్లా జాగృతి అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్‌రావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కుటుంబ సమేతంగా కలిసి జిల్లాలో జాగృతి బలోపేతం, పనితీరు గురించి వివరించారు.



ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

# రెట్టింపు లక్ష్యం..!

- టార్గెట్ సాధనలో ఏఎంసీల వెనుకంజ
- తగ్గిన మార్కెట్ యార్డుల ఆదాయం
- ధాన్యం కొనుగోళ్లతో వచ్చే సెస్‌తోనే.. వ్యవసాయ మార్కెట్ యార్డుల నిర్వహణ
- ఈసారి ఆదాయ లక్ష్యం మరింత పెంపు

సాక్షి, ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొన్నేళ్ల కిందట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లకు ఆదాయం రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు లభించేది. ప్రస్తుతం ఈ ఆదాయం సుమారుగా సగానికి పడిపోయింది. మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అధికారులు ఇటీవల నిర్మల్ జిల్లాలో ఉమ్మడి మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. గత మూడేళ్లలో ఏఎంసీలకు లభించిన ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని దానిపై 20 శాతం పెంచేలా ప్రణాళిక చేశారు. త్వరలో ఈ లక్ష్యం ఖరారు కానుంది. అయితే లక్ష్య సాధనలో మార్కెట్ కమిటీలు విఫలమవుతున్నాయి.

**ఎందుకీ పరిస్థితి..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, వరి, సోయాబీన్, పప్పుదినుసులు, మొక్క జొన్న తదితర పంటల కొనుగోలుపై మార్కెట్ కమిటీలకు ఒక శాతం సెస్ లభిస్తుంది. దీని ఆధారంగానే ప్రతీ ఏడాది లభించే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని మార్కెటింగ్ అధికారులు ఏఎంసీల వారీగా ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశిస్తారు. అయితే పత్తి కొనుగోళ్ల విషయంలో రెండేళ్లుగా ప్రైవేట్‌లో మద్దతు ధరను మించి ఉండడంతో భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు రంగంలో లేదు. అలాగే ఈ ఏడాది పత్తి ధర పెరుగుతుందన్న ఆశతో రైతులు పూర్తి స్థాయిలో పత్తిని విక్రయించలేదు. ఈ ప్రభావం మార్కెట్ సెస్‌పై పడింది. అంతే కాకుండా పలువురు రైతులు పత్తికి ఇక్కడి కంటే మహారాష్ట్రలో ధర అధికంగా లభిస్తుందని అక్కడికి తీసుకెళ్లి విక్రయించారు. ఈ ప్రభావం ఆదాయంపై అమితంగా కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో వరి ధాన్యం మద్దతు ధరతో కొనడంతో దాని ద్వారా వచ్చే సెస్ యథావిధిగా వచ్చింది. అయితే ఈ నాలుగు జిల్లాల్లో పత్తి పెద్ద ఎత్తున కొనుగోలు జరిగే మార్కెట్ యార్డుల్లో ఈ ఏడాది కొనుగోళ్ల మందగించడంతోనే పరిస్థితి ఇలా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఏఎంసీల వారీగా ఆదాయ లక్ష్య ప్రణాళిక**

| మార్కెట్‌యార్డు | లక్ష్యం |
|---|---|
| ఆదిలాబాద్ | రూ.10.35 కోట్లు |
| ఆసిఫాబాద్ | రూ.6.68 కోట్లు |
| చెన్నూర్ | రూ.5.95 కోట్లు |
| భైంసా | రూ.5.45 కోట్లు |
| లక్సెట్టిపేట | రూ.3.65 కోట్లు |
| నిర్మల్ | రూ.3.50 కోట్లు |
| కాగజ్‌నగర్ | రూ.2.54 కోట్లు |
| బోథ్ | రూ.2.22 కోట్లు |
| బెల్లంపల్లి | రూ.2.18 కోట్లు |
| ఖానాపూర్ | రూ.1.80 కోట్లు |
| జైనథ్ | రూ.1.58 కోట్లు |
| ఇంద్రవెల్లి | రూ.1.43 కోట్లు |
| మంచిర్యాల | రూ.1.27 కోట్లు |
| జన్నారం | రూ.1.20 కోట్లు |
| సారంగపూర్ | రూ.1.20 కోట్లు |
| ఇచ్చోడ | రూ.97 లక్షలు |
| జైనూర్ | రూ.79 లక్షలు |
| కుభీర్ | రూ.51 లక్షలు |

### త్వరలో లక్ష్యాలు ఖరారు



మార్కెట్ల వారీగా 2023–24 సంవత్సరం ఆదాయ లక్ష్య ప్రణాళిక రాష్ట్ర అధికారుల వద్ద ఉంది. త్వరలో ఈ టార్గెట్‌కు సంబంధించి ఉత్తర్వులు వెలువడతాయి. పత్తి కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో మార్కెట్లకు పూర్తి స్థాయిలో ఆదాయం లభించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్ల విషయంలో ఉన్న పరిస్థితే ఇక్కడా ఉంది. దీంతో ఆదాయం తగ్గింది.
– శ్రీనివాస్, డీఎంవో, ఆదిలాబాద్

**జిల్లాల వారీగా ఇదీ పరిస్థితి..**

మరి కొద్దిరోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఆదిలాబాద్ జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీల ద్వారా 2022–23లో రూ.9.83 కోట్ల ఆదాయం వచ్చే పరిస్థితి ఉండగా 2023–24 ఆర్థిక సంవత్సరం ఆదాయ లక్ష్యం రూ.16.55 కోట్లు నిర్దేశించేలా ప్రణాళిక చేశారు. నిర్మల్ జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీల నుంచి ఈ ఏడాది రూ.11.20 కోట్లు ఆదాయం వచ్చే పరిస్థితి ఉండగా.. వచ్చే ఏడాది రూ.12.46 కోట్లు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మూడు మార్కెట్ కమిటీల్లో ఈ ఏడాది రూ.7.38 కోట్లు వచ్చే పరిస్థితి ఉండగా.. వచ్చే ఏడాదికి రూ.10.01 కోట్లు, మంచిర్యాల జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీల్లో ఈ ఏడాది రూ.8.30 కోట్లు వచ్చే పరిస్థితి ఉండగా.. వచ్చే ఏడాది రూ.14.26 కోట్లు లక్ష్యం రావాలని ప్రణాళిక రూపొందించారు.



మర్రి మాను నీడలో..

జిల్లాలో రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు మనుషులే కాదు మూగజీవాలూ అల్లాడుతున్నాయి. గురువారం భీంపూర్ మండలం నిపాని గ్రామ శివారుకు మేతకు వెళ్లిన పశువులు మధ్యాహ్నం వేళ ఎండకు తాళలేక ఇలా పచ్చని మర్రిచెట్టు నీడలో సేద తీరుతూ కనిపించాయి.
– తాంసి

# అగ్గి రాజుకుంటే అంతే..

- నాలుగురోజుల కిందట షార్ట్‌సర్క్యూట్‌తో ఇచ్చోడ మండల కేంద్రంలోని నవయువ కాలనీకి చెందిన నర్సమ్మ ఇంటికి నిప్పంటుకుంది. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చేసరికే ఇల్లు కాలిబూడిదైంది. దీంతో స్థానికులు ఫైర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- బోథ్ మండల కేంద్రంలోని న్యూకాలనీకి చెందిన రాథోడ్ సూర్యకళ ఇల్లు ఇరవై రోజుల క్రితం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఫైరింజన్ వచ్చేలోపు ఇంట్లోని వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది.





ఇచ్చోడలో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిబూడిదవుతున్న ఇల్లు (ఫైల్)

- జిల్లాలో మూడే ఫైర్‌స్టేషన్లు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- కాలం చెల్లిన వాహనాలు
- సకాలంలో చేరని ఫైరింజన్లు
- బుగ్గి పాలవుతున్న ఆస్తులు

ఇచ్చోడ: జిల్లాలో అగ్గి రాజుకుంటే ఆస్తులు బుగ్గిపాలు కావాల్సిందే. మంటలార్పే అగ్నిమాపకశాఖకు శక్తి లేకుండా పోయింది. ప్రమాదం జరిగిన చోటుకు సకాలంలో ఫైరింజన్లు చేరడంలేదు. కాలం చెల్లిన ఫైరింజన్లు ఘటనా స్థలానికి చేరుకునేలోపు ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయి. కొన్నేళ్లుగా ప్రభుత్వం ఆ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలేదు. సిబ్బంది కొరతతో ఉన్నవారితో నెట్టుకొస్తున్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు సకాలంలో ఫైరింజన్లు చేరుకోకపోవడంతో సిబ్బంది అక్కడి జనాల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తోంది.

**మూడు ఫైర్‌స్టేషన్లు.. 508 గ్రామాలు**

జిల్లాలో 18 మండలాల్లో 508 గ్రామాలున్నాయి. 4.153 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో జిల్లా ఉంది. జిల్లాలో ఆదిలాబాద్ ఇచ్చోడ, ఉట్నూర్‌లో మూడు ఫైర్‌స్టేషన్లున్నాయి. వీటి పరిధిలో 30నుంచి 50కిలోమీటర్ల దూరంలోని గ్రామాలే ఎక్కువ. ఏటా వేసవిలో మారుమూల గ్రామాల్లో అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. ఫైర్‌స్టేషన్ నుంచి 50కిలోమీటర్ల దూరంలోని గ్రామాలకు ఫైరింజన్ చేరుకునే లోపే ప్రజల ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయి. దీంతో పలు సందర్భాల్లో అగ్నిమాపకశాఖ సిబ్బందిపై అక్కడి జనాలు ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి.

**జిల్లాలో ఇలా..**

జిల్లా కేంద్రంలో 50వరకు పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీలున్నాయి. ఇచ్చోడ, బోథ్, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, నేరడిగొండ మండలాల్లో మరో 20వరకు పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీలున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ గోదాంలతోపాటు చిన్న తరహా పరిశ్రమలున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్‌వి కలిపి 80వరకు డిగ్రీ, జూనియర్ కళాశాలలున్నాయి.

**జిల్లాలో ఫైర్‌స్టేషన్ల వివరాలు**

| | |
|---|---|
| ఫైర్‌స్టేషన్లు: 3, ఫైరింజన్లు: 4, ఫైర్‌మెన్లు: 12 | |
| డ్రైవర్లు: 4, ఫైర్ ఆఫీసర్లు: 3, గ్రామాలు: 508 | |
| విస్తీర్ణం: 4.153 చ.కిమీ | |

**కాలం చెల్లిన వాహనాలు**

జిల్లాలోని మూడు ఫైరింజన్లు కూడా కాలం చెల్లినవే. ఉట్నూర్‌లోని ఫైరింజన్ వాహనాన్ని ఇటీవల మరమ్మతు కోసం హైదరాబాద్‌కు పంపించారు. తాత్కాలికంగా నిర్మల్ జిల్లా నుంచి ఫైరింజన్‌ను ఉట్నూర్ స్టేషన్‌లో అందుబాటులో ఉంచారు. ఆదిలాబాద్‌లోని ఫైరింజన్ 13 ఏళ్ల పాతది కాగా, ఇచ్చోడ ఫైరింజన్ 15 ఏళ్లనాటిది. జిల్లాలోని నాలుగు ఫైరింజన్లు కూడా పాతవి కావడంతో ప్రమాదాలు జరిగిన ప్రదేశాలకు అనుకున్న సమయానికి చేరుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది

**వేధిస్తున్న సిబ్బంది కొరత**

జిల్లా కేంద్రంలోని ఫైర్‌స్టేషన్‌లో 10మంది ఫైర్‌మెన్లు ఉండాలి. కానీ నలుగురు మాత్రమే ఉన్నారు. ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముగ్గురు డ్రైవర్లకు ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఇచ్చోడ ఫైర్‌స్టేషన్‌లో 10 మంది ఫైర్‌మెన్లకు నలుగురే ఉన్నారు. ముగ్గురు డ్రైవర్లకు ఇద్దరే పని చేస్తున్నారు. ఉట్నూర్ ఫైర్‌స్టేషన్‌లో పది మంది ఫైర్‌మెన్లు ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. ముగ్గురు డ్రైవర్లకు ఒకే డ్రైవర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఐదేళ్లుగా ఫైర్ ఆఫీసర్ లేక పోవడంతో సీనియర్ ఫైర్‌మెన్ ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. యాభైఏళ్ల క్రితం నిర్మించిన అగ్నిమాపక కేంద్రం శిథిలావస్థకు చేరింది.

### సిబ్బంది కొరత ఉంది

జిల్లాలో సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే. కానీ.. అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వానికి నివేదిక అందజేశాం.
– కేశవులు, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి

# నేడు సర్పంచులకు సన్మానం

కైలాస్‌నగర్: జిల్లా స్థాయిలో ఇటీవల ఉత్తమ సర్పంచులుగా అవార్డులు అందుకున్న 27 మందిని శుక్రవారం రాష్ట్రస్థాయిలో సన్మానించనున్నారు. హైదరాబాద్‌లోని టీఎస్ ఐపార్డ్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి వారిని తరలించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా సన్మానం అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు వీరికి అభినందనలు తెలిపారు.

# ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు

- ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు
- విద్యార్థులకు మెళకువలపై ఉపాధ్యాయుల సూచనలు

పదోతరగతి పరీక్షలు ఏప్రిల్ 3నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది నుంచి ఆరు పేపర్లతోనే పరీక్షలు నిర్వహించనున్నారు. సిలబస్ మాత్రం పూర్తిగా చదవాల్సి ఉండగా రాయాల్సిన పరీక్షల సంఖ్య తగ్గుతోంది. అయినా ప్రణాళిక ప్రకారం సన్నద్ధమైతే మెరుగైన ఫలితాలు సాధించడం కష్టమే కాదంటున్నారు నిపుణులు. మరోవైపు పరీక్ష సమయం సమీపిస్తుండడంతో విద్యార్థులు ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. పరీక్షల్లో విద్యార్థులకు ఎదురయ్యే సందేహాల నివృత్తితో పాటు మెలకువలపై నిపుణుల సలహాలు, సూచనలు ఇలా ఉన్నాయి. – మంచిర్యాలఅర్బన్



### భయాన్ని వదిలితే మెరుగైన ఫలితం...



గణితం అంటే కష్టమైన సబ్జెక్టు అనే భయాన్ని దూరం చేయాలి. అద్భుతమైన ఫలితాన్ని పొందవచ్చు. సూత్రాలు, సమస్య సాధనలో సెప్స్ మీద ఎక్కువ దృష్టి పెట్టాలి. కొన్ని ప్రశ్నలకు నిర్మాణ క్రమం రాయటం, గ్రాఫ్ గీయటంపై ప్రత్యేక సాధన చేయాలి. సమితులు సంఖ్యాశాస్త్రం, సంభావ్యత వంటి సులువైన చాప్టర్స్ నుంచి వచ్చే ప్రశ్నలపై ఎక్కువగా దృష్టి పెట్టాలి. సంఖ్యా వ్యవస్థ, బీజ గణితం, నిరూపక రేఖాగణితం, క్షేత్ర సితి, త్రికోణమితి అధ్యాయాలపై సంపూర్ణ అవగాహన అవసరం.

– కృష్ణ, గణితం, జెడ్పీఎస్ఎస్, వెల్గనూర్

### ఆసక్తి ఆధ్యంతం



ఇది పార్ట్‌బీ ప్రశ్నాపత్రం, సమయం గంటన్నర ఇస్తారు. ఈసబ్జెక్టులో విషయ అవగాహన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు అవసరం. పార్ట్ ఏ–30 మార్కులు, పార్ట్–బీ 10 మార్కులు ఉంటాయి. జీవశాస్త్ర పుస్తకంలో 10 పాఠ్యాంశాలకు మొదటి ఆరు పాఠాలు అనువంశికతపై విద్యార్థులు ఎక్కువ శ్రద్ధ చూపాలి. ప్రయోగాలపై అవగాహన అవసరం. అంశాల వారీగా చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్ సొంతంగా రూపొందించుకోవాలి. వాస్తవిక పరిస్థితులకు అన్వయిస్తూ పఠనం సాగాలి. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై ఎంత పట్టు ఉంటే అంత మంచిది.

– శోభారాణి, బయోసైన్స్, జెడ్పీహెచ్ఎస్ చంద్రవెల్లి, బెల్లంపల్లి

### సమయ నిర్వహణ కీలకం



ఈసారి రెండు పేపర్లు కాకుండా 80మార్కులు ఒకే పేపర్‌లో రాయాల్సి ఉంటుంది. తెలుగు మీడియం విద్యార్థులు భయపడొద్దు. పార్ట్ ఏ,బీ,సీ సెక్షన్‌పై అవగాహన పెంచుకోవాలి. అక్షర దోషాలపై దృష్టిపెట్టాలి. టెక్స్ట్ డిపెండెంట్, ఇండిపెండెంట్ అంశాలపై పట్టు సాధించాలి. డిస్కోర్స్ రాసేటప్పుడు స్పష్టంగా చక్కని లేఅవుట్ రాయాలి. వ్యాకరణ అంశాల ద్వారా ఖచ్చితమైన గరిష్ట మార్కులు సాధించవచ్చు. క్వశ్చన్ ట్యాగ్, వాయిస్, స్పీచ్, కంబైనింగ్, టెన్స్, ఆర్టికల్స్, ప్రిపోషిజన్, ఆంటోనిమ్, సినానిమ్స్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– వరప్రసాద్, జెడ్పీహెచ్ఎస్, వీగాం, భీమిని

### ప్రయోగాలపై పట్టు అవసరం..



ప్రయోగ సమాచార సేకరణలో నైపుణ్యాలు, బొమ్మలు, నిత్య జీవితంలో వినియోగం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పార్ట్ ఏ అంశాలను అప్లికేషన్ అప్రోచ్‌తో చదవాలి. చాప్టర్లను నిజజీవిత సంఘటనలో అన్వయించాలి. విషయ అవగాహనతో పాటు ప్రశ్నించటం, పరికల్పన చేయటం, ప్రయోగాలు, క్షేత్రపర్యటనలు, నైపుణ్యాలు, ప్రాజెక్టు పనుల పటాలు ద్వార లోతైన అధ్యయనం చేయాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరిమాణ నిర్మాణం, కార్బన్, సమ్మేళనాలపై పట్టుసాధించాలి. పార్ట్ బీ కోసం ప్రతి పాఠ్యాంశాలోని ముఖ్యాంశాలతో బీట్ బ్యాంకు తయారు చేసుకోవాలి.

– తిరుపతి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, జెడ్పీఎస్ఎస్ దేవులవాద

### విషయ అవగాహనకు ఎక్కువ మార్కులు



–సాంఘిక శాస్త్రంలో విషయ అవగాహనకు ఎక్కువ మార్కులు ఉన్నందున పుస్తకంలోని ముఖ్యమైన భావనలు అర్థం చేసుకుని అడిగిన ప్రశ్నకు సరైన రీతిలో సమాధానాలు రాయాలి. వివరించటం, పోలికలు భేదాలు తెలపటం, కారణాలు, ఫలితాలు చెప్పటం, వర్గీకరించడం లాంటి రూపాల్లో ప్రశ్నలు ఉంటాయి. పటనైపుణ్యాలు, సమాచార నైపుణ్యాలు, ప్రశంస–సున్నితత్వం, ఇచ్చిన అంశాన్ని చదివి వ్యాఖ్యలు రాయటంపై సాధన చేయాలి. పటాలు, పట్టికలు, గ్రాఫ్‌లపై పట్టు ఉంటే ఎక్కువ మార్కులు వస్తాయి. పాత ప్రశ్నపత్రాలు పరిశీలించాలి. అభ్యాస దీపికలోని అంశాలను బాగా చదవాలి.

– మహేష్, సోషల్ టీచర్, జెడ్పీహెచ్ఎస్ బాలుర మంచిర్యాల

### వ్యాకరణ అంశాలపై అభ్యాసం చేయాలి



ప్రతి పాఠంలోని వ్యాకరణ అంశాలు క్షుణంగా అభ్యాసం చేయాలి. ద్వితీయ భాషా హిందీలో 80 (పార్ట్ ఏ, బీ)లో 16 అంకేలు వస్తే పాస్. 100లో 20వస్తే పాస్ అవుతారు. పేరాగ్రాఫ్ పద్యాలు, వ్యాకరణ అంశాలు అభ్యాసం చేస్తే పక్క ఉత్తీర్ణులవుతారు. సృజనాత్మకతను పరీక్షించే లేఖారచన, వ్యాసాలు, సాక్షాతాకర్, కరపత్ర పోస్టర్ అంశాలను బాగా చదవాలి. బాషాదోషాల్లేకుండా అందంగా రాసేందుకు ప్రయత్నించాలి. పార్ట్ బీలో వ్యాకరణాంశాలుంటాయి. పాఠ్యపుస్తకంలోని బాషాకి బాత్ ఆధారంగా అభ్యసించాలి.

– నీలేష్ కుమార్, హిందీ ఉపాధ్యాయుడు

### చేతిరాత ముఖ్యం



పద్యగద్యభాగంలోని ముఖ్యాంశాల్ని పునశ్చరణ ముఖ్యం. పాఠ్య పుస్తకంలోని విషయ అవగాహన కలిగి ఉండాలి. మంచిర్యాల రాతకు మంచి గుణములు పొందే అవకాశం ఉంటుంది. భాషా దోషాలు లేకుండా అకర్షణీయంగా రాయటానికి ప్రయత్నం చేయాలి. ఏయే పాఠ్యాంశాన్ని ఏకవి, రచయిత రాశారో తెలిసి ఉంటే నాలుగు లఘు సమాధాన ప్రశ్నలకు 12 మార్కులు పొందవచ్చు. వ్యాసాల్లో అపరిచిత గద్యం కూడా ప్రధానమే. దీన్ని సొంతంగా ఆలోచిస్తూ చదవాలి. ఉపవాచకానికి సంబంధించి పాత్రల స్వభావం తెలుసుకోవటం ప్రధానం. వ్యాకరణలో సందులు, సమాసాలు, అలంకారాలు, చందస్సుపై దృష్టి పెట్టాలి.. మంచి చేతిరాతతో మార్కులు లభిస్తాయి.

– సత్యనారాయణచారి, దుగ్నేపల్లి, చెన్నూర్

# చెట్టు మీద గంజాయి



చెట్టు మీద ఉన్న ప్లాస్టిక్ డబ్బాలు

- ప్లాస్టిక్ డబ్బాలో పెంచుతున్న యువకులు
- రోజు గంజాయి సేవిస్తున్న వైనం
- బోథ్‌లో విచ్చలవిడిగా గంజాయి లభ్యం

**బోథ్:** గతంలో పోలీసులు దాడులు చేయడంతో గంజాయి పంట వేయడం, సరఫరా గత కొన్ని రోజులుగా బోథ్ మండల వ్యాప్తంగా తగ్గిపోయింది. ఇటీవల మళ్లీ బోథ్ మండల వ్యాప్తంగా సరఫరా అవుతోంది. మండల కేంద్రంలోని సాయినగర్‌ను అనుకుని ఉన్న వెంచర్‌లోని ఓ మామిడి చెట్టుకు పైభాగంలో కొంతమంది యువకులు ప్లాస్టిక్ డబ్బాలో మట్టిని నింపి అందులో గంజాయి మొక్కలను పెంచుతున్నారు. ప్రతి రోజు కొంతమంది యువకులు చెట్టు దగ్గరికి చేరుకుని గంజాయిని సేవిస్తున్నారు. చేనుల్లో సైతం ఎవరికంట పడకుంగా చెట్ల పైన డబ్బాల్లో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు తెలుస్తోంది.

**విచ్చలవిడిగా గంజాయి సరఫరా..**

మండలంలో గంజాయి విచ్చలవిడిగా సరఫరా అవుతోంది. 10వ తరగతి మొదలుకుని విద్యార్థులు, యువకులలతో పాటు పలువురు గంజాయికి బానిసవుతున్నారు. మండల కేంద్రంలోని కల్లుబట్టీ దగ్గర, రాత్రి వేళల్లో స్థానిక పాత ప్రభుత్వ కళాశాల భవనం, పిప్పల్‌ధరి రోడ్డు, పెద్ద వాగు సమీపంలో, మోడల్ స్కూల్ వెనుక భాగంలో, పలు వెంచర్‌లల్లో గంజాయిని సేవిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యువత గంజాయికి బానియ్యారు. బడికి వెళ్లాల్సిన విద్యార్థులు సైతం గంజాయికి అలవాటు పడటం ఆందోళన కలిగిస్తోంది.

**పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలి..**

యువత గంజాయికి బానిస కావడం ఆందోళన చెందే విషయం.. ఈ విషయంపై పోలీసులు ప్రత్యేక చొరవ చూపించాల్సిన అవసరం ఉంది. గంజాయి సరఫరాపై నిఘా పెట్టాలి. గతకొంత కాలంగా బోథ్‌లో గంజాయి సరఫరా చాపకింద నీరులా సాగుతోంది. నిరంతరంగా పెట్రోలింగ్ నిర్వహించాల్సిన అవసరం ఉందని, సాయంత్రం వేళల్లో గంజాయిని విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కల్లు బట్టీల వద్ద కొంత మంది విక్రయిస్తున్నట్లు సమాచారం.



ప్లాస్టిక్ డబ్బాల్లో పెంచుతున్న గంజాయి మొక్కలు

## క్లుప్తంగా

### వాహనం ఢీకొని జింక మృతి

**భైంసారూరల్:** మండలంలోని తిమ్మాపూర్ గ్రామం వద్ద భైంసా–నిర్మల్ రహదారిపై గురువారం ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో జింక మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ బీట్ అధికారి మీనా, ఎస్‌వో కోటేశ్, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని జింక కళేబరాన్ని పరిశీలించారు. అనంతరం దాన్ని స్వాధీనం చేసుకుని ఖననం చేశారు.

### మిస్సింగ్ కేసు నమోదు



సాయిచరణ్

**ముధోల్:** మండలంలోని బోరిగాం గ్రామానికి చెంది న మంచువార్ సాయిచరణ్ అనే విద్యార్థిని తండ్రి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రెండు రోజులుగా ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలు డి తండ్రి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశా డు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. విద్యార్థి దిలా వార్‌పూర్ మండలంలోని బీసీ హాస్టల్‌ల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నా డు. స్కూల్‌కు వెళ్లాలని తండ్రి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు.

### పోలీసు కమాండ్ కంట్రోల్ భవనంలో చోరీ

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి రాంనగర్ బస్తీ ప్రాంతంలో కొత్తగా నిర్మాణం చేసిన పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ భవనంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. భవన నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ కె.పద్మారెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కమాండ్ కంట్రోల్ రూమ్ భవనానికి అమర్చిన 10 టేకు తలుపులు, 14 ఫ్యాన్లు, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు.





నిర్మల్‌లోని శోభాయాత్రలో జై శ్రీ రామ్ నినాదాలు చేస్తున్న యువత



కాషాయ జెండాతో ట్రాక్టర్ పై కూర్చున్న చిన్నోడు



బోథ్‌లో సీతారాముల వేశంలో బాలలు

# రాములోరి శోభాయాత్ర

- ప్రశాంతంగా ముగిసిన శ్రీరామనవమి
- నృత్యాలతో యువత కేరింతలు
- దారి పొడుగునా అన్నదానం, ప్రసాద వితరణ
- పోలీసుల భారీ బందోబస్తు

శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాముడి శోభాయాత్ర ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గురువారం కనుల పండువగా కొనసాగింది. జైశ్రీరామ్ నినాదాలతో వీధులన్నీ మార్మోగాయి. యువత కాషాయ జెండాలు పట్టుకుని నృత్యాలు చేశారు. జై నినాదాలతో హోరెత్తించారు. యువతి యువకులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు శోభాయాత్రలో పాల్గొని నృత్యాలు చేశారు. శ్రీరాముడి, ఛత్రపతి శివాజీ విగ్రహాలతో హిందూవాహిని ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర మార్గంలో వివిధ యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రసాదం వితరణ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిర్మల్‌టౌన్/ భైంసాటౌన్/బోథ్:



నిర్మల్‌లో నృత్యం చేస్తున్న యువతులు



శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, బీజేపీ నాయకులు



ఆదిలాబాద్‌లో...



బోథ్‌లో...



భైంసాలో బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్



మంచిర్యాలలోని శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు



ఛత్రపతి శివాజీ విగ్రహంతో..



భైంసాశోభాయాత్రలో పాల్గొన్న భక్తులు